క్లుప్తంగా

నేడు ఆశీల వేలంపాట

భామిని: స్థానిక వార్డు సచివాలయం వద్ద వారపుసంత ఆశీల వేలంపాట శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సచివాలయ కార్యదర్శి బి.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగే ఈ వేలంపాటలో పాటదారులు పాల్గొని, ఆశీలు సొంతం చేసుకోవాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీల్లో కురుపాం విద్యార్థుల ప్రతిభ

కురుపాం: జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో కురుపాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ పట్టణంలో ఈ నెల 28వ తేదీన జరిగిన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎస్.స్వప్నిక, ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.లక్ష్య పాల్గొని, వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి, బహుమతులు కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయుడు తోట శంకరరావు తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థులకు పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్టు తయారీకి పంచాయతీ కార్యదర్శులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఇళ్లలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడానికి వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి అవసరమైన యంత్రాలు ఉత్పత్తి చేయడానికి, తడి చెత్త, పొడిచెత్తను శుద్ధి చేసేందుకు వనరులను సమకూరుస్తూ గ్రామాల శివారుల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో క్లాప్ మిత్రలకు వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి అవసరమైన మెలకువలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే చెల్లన్నాయుడువలస, బూర్జ, అంటిపేట, కాశీపేట, చినభోగిలి, తామరఖండి గెడ్డలుప్పి, నిడగల్లు, జానుమల్లువలస, పెదభోగిలిలోని కేంద్రాలు వర్మీకంపోస్టు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పంచాయితీ విస్తరణాధికారి కె కుమారవర్మ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశానికి హాజరుకావాలి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సమావేశంలో పాల్గొంటారని, సమావేశానికి కౌన్సిలర్లంతా హాజరుకావాలని కోరారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ మార్కొండపుట్టి ఫీడర్ పైన ఉన్న గ్రామాలకు చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ కటింగ్) కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శాంతారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మార్కొండపుట్టి, మంత్రివానివలస, తెలగడవలస, బట్టివలస, కవిరివలస, కాకులవానివలస, శిబిల్లి, వీరడవలస, పెద్ద గైసిలా, నంద కత్తుల గైసిలా, గుడి గైసిలా, కేంద్రు గైసిలా తదితర గ్రామాల వినియోగదారులు సహకరించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

కేటీఆర్‌కు శ్రీరామనవమి పురస్కారం

రాజాం: పట్టణానికి చెందిన రచయిత కేటీఆర్(కుదమ తిరుమలరావు) హైదరాబాద్‌కు చెందిన తెలుగు సాహిత్య జాతీయ వేదిక శ్రీరామనవమి పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలకు రామమందిరం అనే కవితను తిరుమలరావు రచించి, పంపించారు. ఈ కవిత ఎంపిక కావడంతో సంస్థ అధ్యక్షుడు పక్కి రవిశేఖర సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావు కేటీఆర్‌కు అభినందనలు తెలిపి, కొరియర్‌లో పురస్కారాన్ని పంపిస్తున్నట్లు తెలిపారు.

నేడు సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, చేపట్టిన సోషల్ ఆడిట్‌పై శుక్రవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు తెలిపారు. గత పదిరోజులుగా మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, జరిగిన ఉపాధి పనులు, ఖర్చు, అక్రమాలు, లోపాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.



వీరఘట్టం: నీలానగరం గ్రామంలో పూజలందుకున్న సీతారాములు



వీరఘట్టం: నీలానగరంలో ఎమ్మెల్సీ విక్రాంత్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



వీరఘట్టం: శ్రీరామనవమి సందర్భంగా చిట్టపులివలసకు చెందిన శ్రీనివాసరావు గీసిన శ్రీరాముని చిత్రం



పాలకొండ రూరల్: సింగన్నవలసలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి

జగదానంద కారక.. జయ జానకి ప్రాణ నాయక...

ధర్మ పరిరక్షణకు జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత ప్రజాపాలకుడు శ్రీరాముడు.. లోక కల్యాణార్థం ఎన్నో కష్టాలను ఓర్చిన సీతారాముల బంధం పవిత్రం.. అజరామరం.. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం. చైత్రశుద్ధ నవమి నాడు అయోధ్యలో రఘువంశంలో జన్మించిన రామయ్య సీతాదేవిని వివాహమాడి.. తండ్రి ఆజ్ఞానుసారం పద్నాలుగేళ్ల పాటు అరణ్యవాసం చేసి, అనంతరం రావణ సంహారం తర్వాత చైత్రశుద్ధ నవమి నాడే మళ్లీ సీతాసమేతంగా అయోధ్యలోనే పట్టాభిషిక్తుడయ్యాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే వాడవాడలా గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా చేపట్టారు. స్వామి కల్యాణం చూసి తరించేందుకు భక్తులు ఉవ్విళ్లూరారు. బెల్లం, మిరియాలతో తయారు చేసిన పానకాన్ని భక్తులకు అందజేశారు. కల్యాణం తర్వాత ఉత్సవమూర్తుల ఊరేగింపుతో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

–సాక్షి నెట్‌వర్క్



కురుపాం కోటలో శ్రీరామనవమి పూజల్లో కేంద్ర మాజీమంత్రి కిశోర్‌చంద్రదేవ్ దంపతులు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



జియ్యమ్మవలస: వెంకటరాజపురం గ్రామంలో రామాలయంలో భక్తుల పూజలు



గరుగుబిల్లి: భక్తులతో కిక్కిరిసిన తోటపల్లి శ్రీకోదండరామాలయం



గరుగుబిల్లి: ఉల్లిబద్ర గ్రామంలో శ్రీరామనవమి పూజలు



సీతంపేట: ఐటీడీఏ పాత క్వార్టర్స్ వద్ద సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు



గరుగుబిల్లి: సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



భామిని: బాలేరులో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



వీరఘట్టం: కంబరలో రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వీరఘట్టం: రామాలయంలో మహిళల దీపారాధన



కొమరాడ: అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు



కొమరాడ: ఆలయంలో వైస్ ఎంపీపీ శరత్‌బాబు దంపతుల పూజలు

నేడు మన్యం బంద్



మన్యం బంద్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏపీ గిరిజన సంఘం నాయకులు

కురుపాం: బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దని కోరుతూ మన్యం బంద్‌కు గిరిజన సంఘాలు పిలుపునిచ్చాయి. ఇదే విషయమై రూపొందించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో సంఘ సభ్యులతో కలిసి సంఘ నాయకుడు మండంగి శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. శుక్రవారం జరిగే బంద్‌లో అందరూ పాల్గొని, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తూర్పుముఠా ప్రాంతంలోని నీలకంఠాపురం ఎస్ఐ అనిల్ కుమార్‌కు ఏపీ గిరిజన సంఘం నేతలు బిడ్డిక అన్నాజీరావు, అడ్డాకుల మన్మధరావు, ఇంటికుప్పల రామకృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు. తమ నిరసన వాణి ప్రభుత్వానికి వినపడేలా బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

పాలకొండ: మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట వాహన తనిఖీలు నిర్వహించిన పోలీస్ సిబ్బంది పలువురు మైనర్ల వాహనాల నుంచి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిచి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల చోటుచేసుకుంటున్న ప్రమాదాలు ఎక్కువగా మైనర్లు వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపవద్దని తెలిపారు.

రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ పరిశీలన



కొమరాడలో గొడౌన్ సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండే

కొమరాడ: మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం గొడౌన్‌ను రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండే గురువారం పరిశీలించారు. రైతులు తమ పంటలను సంరక్షించుకోవడంతో పాటు ధర అనుకూలంగా ఉన్నప్పుడు తమ పంటలు అమ్ముకునేందుకు వీలుగా ప్రభుత్వం ఈ గొడౌన్‌ల నిర్మాణం అంతటా చేపడుతోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 30 చోట్ల ఈ గొడౌన్‌ల నిర్మాణం వివిధ దశలో ఉన్నాయని, కొమరాడలో నిర్మాణం పూర్తయిందని కమిషనర్‌కు అధికారులు వివరించారు. గొడౌన్‌లన్నీ వినియోగంలోకి వస్తే రైతులకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందని కమిషనర్ అన్నారు. ఆయన వెంట కొమరాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మరడాన సూరపునాయుడు ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు, పీఏసీఎస్ సీఈఓ మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వీరఘట్టం: సీఎంఆర్‌ఎఫ్(చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని నీలానగరం గ్రామానికి చెందిన పెయింటర్ అక్కివరపు రాంబాబుకు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్సీ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. ఇప్పటివరకు ఎంతో మంది పేదలకు సీఎంఆర్‌ఎఫ్ సాయం అందిందని, వారంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఎమ్మెల్సీ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలవల్లి పురుషోత్తమరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఏపీఈపీడీసీఎల్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈఈ టీజీకే మూర్తి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి, సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.10 వేలు విరాళం



వృద్ధాశ్రమ నిర్మాణానికి ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

రాజాం సిటీ: పట్టణ సమీపంలోని కొండంపేటలో వృద్ధాశ్రమ నిర్మాణానికి స్థానిక మల్లిఖార్జునకాలనీలో తాత్కాలిక వృద్ధాశ్రమ నిర్వాహకులకు దాతలు విరాళాలు అందజేశారు. గురువారం డోలపేటకు చెందిన కె.ఎస్.ఎన్. రాజు దంపతులు రూ.10 వేల చెక్కును నిర్వాహకుడు పి.శ్రీనివాస్‌కు అందించి, తమ ఔదార్యం చాటుకున్నారు. ఆశ్రమ నిర్మాణానికి మరింతమంది దాతలు ముందుకువచ్చి, సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

రాజాం: పట్టణాభివృద్ధికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. గురువారం పట్టణంలోని గొల్లవీధిలో రాజాం సెయింట్ ఆన్స్ హాస్పిటల్ సాయంతో తాగునీటి బోరు వేసేందుకు సంబంధించిన అనుమతిపత్రం ఎమ్మెల్యే అందజేశారు. వేసవి నేపథ్యంలో పట్టణంలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చేసేందుకు తమవంతు సహకారం అందిస్తున్నామని దాతలు అన్నారు. అందరి సహకారంతో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అన్నారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయి మందిరంలో దేవీ సహిత జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి చేపట్టారు. అనంతరం బాబాకు ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేశారు. వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులు హోమం చేశారు. శ్రీరామనవమితో పాటు జైగురుదత్త హోమం చేపట్టడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ఎంఈఓ నారాయణస్వామి చేతులమీదుగా బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొమరాడ: మండలంలోని దేవుకోన పంచాయతీ, చోళ్లపథం గ్రామ మలుపు వద్ద ఫిబ్రవరి 22వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో అంటివలస గ్రామానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాధిత కుటుంబాలకు యూటీఎఫ్ తరఫున దాదాపు రూ.80 వేలను ఎంఈఓ జామి నారాయణస్వామి, యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఎస్.మురళీమోహన్ చేతులమీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వి.జ్యోతి, రాయుడు, ఎస్.శ్రీను, పి.వెంకటనాయుడు, పి.మురళి, డి.తిరుపతి, జి.హేమ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

పాలకొండ: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డొంక త్రినాధులు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, పథకం లబ్ధిదారులు, మండల స్థాయి నాయకులు, అధికారులంతా రావాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన భూముల రీసర్వే



కాట్రగడ-బి గ్రామం చేరుకున్న సర్వే రాళ్లు

భామిని: మండల వ్యాప్తంగా భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోంది. నిర్దేశిత గడువులోగా సర్వే పూర్తికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిబ్బంది కూడా యుద్ధప్రాతిపదికన గ్రౌండ్ ట్రూతింగ్, డ్రోన్ సర్వే, భూ సరిహద్దుల గుర్తింపు ఒక్కొక్కటి త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని బత్తిలి, మనుమకొండ, బొమ్మిక, కాట్రగడ-బి గ్రామాల్లో జరుగుతున్న సర్వే పూర్తికావస్తుండగా, గురండి, నులకజోడు, బిల్లుమడ, చిన్నదిమిలి, పెద్దదిమిలి గ్రామాల్లో ఇప్పుడు సర్వేను వేగవంతం చేశారు. రైతుల సమక్షంలోనే భూ హద్దుల గుర్తింపు చేపట్టి, వారి మధ్య ఏళ్ల తరబడి నెలకొన్న భూ తగాదాలను పరిష్కరిస్తున్నారు. ఇప్పుడు బొమ్మిక, కాట్రగడ-బి, బత్తిలి గ్రామాల్లో భూముల సరిహద్దు గుర్తించేందుకు అవసరమైన సర్వేరాళ్లు ఆయా ప్రాంతాలకు చేరుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సర్వే జరగడం వల్ల ఎటువంటి తగాదాలు జరగవని, శాశ్వత భూ హక్కు లభిస్తుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.